'ఎర్రజెండా నీడలో ఏవి వర్మ' అనుభవాలు పుస్తకాన్ని విజయవాడ సమీపంలోని వడ్డేశ్వరం స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్‌లో ఆవిష్కరిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పి మధు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం, ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, పుస్తక రచయిత ఎవి వర్మ

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

- జిపిఎస్ గెజిట్ ప్రతుల దహనం
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తుంటే అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేస్తానని చెప్పిన పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా జీవోను విడుదల చేయలేదని, ఇప్పుడు బ్యాక్ డేట్ తో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మణి గండన్ పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు డిఇవో కార్యాలయం ఎదుట శనివారం జిపిఎస్ గెజిట్ ప్రతులను దహనం చేస్తూ ఉపాధ్యాయులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరిని జిపిఎస్ లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం ఉద్యోగ ఉపాధ్యాయులు మోసగించడమేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజ పత్రాన్ని రద్దు చేయాలని, తక్షణం పాత పెన్షన్‌ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్ లోకి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎస్ స్థానంలో తీసుకొచ్చిన జిపిఎస్ గెజిట్ ప్రతులను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోయుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎస్ రహన బేగం, జిల్లా కార్యదర్శులు కె రెడ్డప్ప నాయుడు, కె సరిత, ఎం పార్థసారథి, పంటపల్లె సురేష్, కె గణేష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ, సాధన కుమార్, సీనియర్ నాయకులు శేఖర్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సురేష్ బాబు, చిరంజీవి, నాగరాజు మొగులయ్య , సర్దార్, ఎం ఎస్ శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ గెజిట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

గంజాయి పై దృష్టి పెట్టాం

డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రతి జిల్లాలో పోలీసులకు నేరపరిశోధనపై అవగాహన కల్పిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గంజాయి నిర్మూలనపై ఎక్కువ దృష్టి పెట్టామని రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు తెలిపారు. తిరుపతి పర్యటన భాగంగా స్థానిక పోలీస్ అతిథి గృహంలో శనివారం ఆయన కర్నూల్ రేంజ్, అనంతపురం రేంజ్ ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతపూర్, కర్నూల్ రేంజ్‌లో నేరాల అదుపు, శాంతి భద్రతలను కాపాడే విధానం, స్థానిక సమస్యలపై అన్ని జిల్లాల అధికారులతో కూలంకుషంగా చర్చించా మన్నారు. కొంతకాలంగా జిల్లాల్లో ఉన్న సవాళ్లపై చర్చించా మన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించడానికి అవసరమైన కొన్ని వనరులు సరిగా లేవని, వాటిలో ముఖ్యంగా వాహనాలు పాత బడ్డాయని, త్వరలో వాహనాలు సమ కూరుస్తామని తెలిపారు. చిన్న చిన్న సర్వీస్ మేటర్సు విషయంలో ఒక ప్లాన్ ప్రకారం వెళ్లి సరి చేసుకుంటామని, సంక్షేమ విషయం సిబ్బందికి బాగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బేసిక్ పోలీస్ బాగా చేయాలని కోరుకుంటున్నామని, పోలీస్ సిబ్బందితోపాటు ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు కూడా బేసిక్ పోలీసింగ్ చేసుకుంటూ ఉండాలని, త్వరలో పోలీసులను రిక్రూట్ చేస్తామని కొంత టైం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, మానవ హక్కులను గౌరవిస్తూ, చట్టాన్ని దుర్వి నియోగం చేయకూడదని, ప్రస్తుతం గంజాయి మీద నూరు రోజులు ప్రణాళిక రూపొందిం చామన్నారు. గంజాయి మాదకద్రవ్యాలపై ప్రజలకు, చిన్నపిల్లలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జిల్లాల్లో ఉన్న సవాళ్ళను పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కోంటు న్నామని, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేం దుకు శ్రద్ధ పెడతామన్నారు. అమాయక గిరిజనులను వాడుకుని గంజాయి సాగు చేయిస్తున్నారు. దాని పై ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే అరికడతా మన్నారు. గంజా ట్రాన్స్పోర్ట్ ఆపాలని చూస్తున్నామని, ప్రజలకు సమాజానికి జవాబు దారీతనంగా ఉంటామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకొని గంజా పంటను గుర్తించి నిర్మూలిస్తామని, చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేస్తామని, గంజాయి నిర్మూలన కోసం ఏటీఎఫ్ (యాంటీ టాస్క్ ఫోర్స్) టీములను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కొత్త చట్టాల గురించి అన్ని పోలీస్ స్టేషన్లో అవగాహన కార్యక్రమాలు జరిగాయని, ఎర్రచందనం అక్రమ రవాణాపై రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షెముషి బాజ్పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కడప జిల్లా ఎస్పి సిద్ధార్థ కౌశల్, సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి హాజరయ్యారు.

లైంగిక వేధింపుల నిరోధక చర్యలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హెచ్ వినోద్‌బట్

లైంగిక వేధింపుల నిరోధక చర్యలపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్ (యుజిసి) ఆదేశాల మేరకు అపోలో యూనివర్సిటీ చిత్తూరులో యూనివర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) 'కార్యాలయ ప్రదేశాలలో లైంగిక వేధింపులు నిరోధ చర్యలు' అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ హెచ్ వినోద్ బట్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువ ఆధారిత విద్య, నైతిక విలువల ప్రాముఖ్య తను వివరించారు. విశిష్ట వక్త అపోలో మెడికల్ కాలేజ్ అటానమి ప్రొఫెసర్ డాక్టర్ సుభద్రా దేవి మాట్లాడుతూ కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, పరిహార చట్టం 2013 గురించి ఉద్యోగులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ జి బి హిమబిందు, ప్రొఫెసర్ పోతరాజు రిజిస్ట్రారు, బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

డిసిసిబి అవినీతిపై విచారణ చేయాలి

జెసికి టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా లోని డిసిసిబి బ్యాంకు లో జరిగిన అవినీతి, అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో గాడి తప్పిన పాలన, సింగిల్ విండోల్లో దోపిడీపై విచారణ చేపట్టాలని టిడిపి నేతలు జేసీ పులి శ్రీనివాసులుకు శనివారం వినతి పత్రం అందించారు. చిత్తూరు జిల్లాలో డిసిసిబిలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని పత్రికల్లో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ముఖ్యంగా రుణాలు మంజూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, అనర్హులకు, వైసీపీ కార్యకర్తలకు రుణాలు మంజూరు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు వార్తలు వచ్చాయి. జెఎల్‌జి రుణాలు సైతం పక్కదారి పట్టించి పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగాయని పత్రికలలో వార్తలు వచ్చాయి. అంతే కాకుండా ఉద్యోగ నియామకాలల్లోనూ పెద్ద ఎత్తున తిరిగి డబ్బులు చేతులు మారాయని పత్రికలలో వార్తలు వచ్చాయి. కోట్ల రూపాయల రుణాలు రైతులకు మంజూరు చేయాల్సి ఉండగా వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సాహంతో పంచుకుతిన్నారని విమర్శలు వచ్చాయి. ఇందులో బ్యాంకు ఉద్యోగులూ పాత్రధారులై ఉన్నారని, వాస్తవాలు బహిర్గతం కావాలంటే జిఎం స్థాయి అధికారి వద్ద విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి బ్యాంకు నిధులను రికవరీ చేయాలని టిడిపిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, కార్యాలయం మేనేజర్ యుగంధర్ పాల్గొన్నారు.

తిరుపతి ఎస్పీగా ఎల్ సుబ్బరాయుడు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్ రాజును కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. డిజిపి కార్యాలయంలో ఉన్న సుబ్బరాయుడును తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఎర్రచందనం అక్రమ నివారణ టాస్కోఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఒకటి రెండు రోజులు ఆయన బాధ్యతలు స్వీకరించి ఉన్నట్లు సమాచారం.

తిరుమలకు చీఫ్ సెక్రటరీ, డిజిపి

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరభ్ కుమార్ ప్రసాద్, డిజిపి ద్వారకా తిరుమల రావు చేరుకున్నారు. చీఫ్ సెక్రటరీకి టిటిడి ఈఓ జె.శ్యామలరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పద్మావతి అతిథి గృహంలో సీఎస్ కు ప్రత్యేక వసతి ఏర్పాట్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. రేపు ఉదయం విఐపి దర్శన సమయంలో ఇరువురు స్వామివారి దర్శించుకుంటారని అధికారులు వెల్లడించారు. డిజిపికి పోలీసు అతిథి గృహంలో బస ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘనస్వాగతం

రేణిగుంట: తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్‌కు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అతిథి సింగ్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ల్యాండ్ అండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

సంఘమిత్రలు రాజీనామా చేయండి..

మండల టిడిపి అధ్యక్షుడు, కార్యకర్తల హుకుం

ప్రజాశక్తి- విజయపురం: 'సంఘ మిత్రలు రాజీనామా చేయండి..!' అంటూ మండల టిడిపి అధ్యక్షుడు, గ్రామ స్థాయి టిడిపి కార్యకర్తలు పెత్తనం చెలాయిస్తున్నారు. 20 సంవత్సరాల పాటు సంఘ మిత్రగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ 'మీరు రాజీనామా చేయండి..' అంటూ ఒత్తిడి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సీఎం సభలకు జనాలు తరలించారని, పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయమై గ్రామ స్థాయి టీడీపీ కార్యకర్తల సహకారంతో మండల టిడిపి అధ్యక్షుడు మండల స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. సంఘంలో పని చేస్తున్న వ్యక్తి గత ఎన్నికల్లో అధికార పార్టీకి పనిచేయడం వల్ల ఉద్యోగం ఊడుతుందేమోనని భయపడి టిడిపి నాయకులతో చేతులు కలిపి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడు. సంఘ మిత్రలకు తోడుగా నిలబడాల్సిన సీసీ తనను తాను కాపాడుకోవడానికి సంఘమిత్రలపై బురద చల్లుతూ 'వారిని తీసి వేయండి' అంటూ వారికి సహకరిస్తున్నారు. మండ లంలో మల్లారెడ్డి కండ్రిగ, ఇల్ల తూరు, పాత ఆర్కాడు ప్రాంతాల్లో బలవంతంగా రాజీనా మా చేయించారు. మండ లంలోని పన్నూరు కలియం బాకం, కాళికాపురం, కెవి పురం గ్రామా లలో ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. సంవత్సరాల తరబడి ఉపాధి హామీలో పని చేస్తున్న క్షేత్ర సహాయ కులను తొలగించాలని ఒత్తిడి చేయడం, వారిని మానసికంగా హింసించడం, నిలిపివేయాలని అధికారులను ఇబ్బంది పెట్టడం వంటి చర్యలు మండలంలో జోరుగా సాగుతుండడం గమనార్హం.

కాణిపాకం అభివృద్ధికి సహకరించండి

పర్యాటక శాఖా మంత్రికి ఎమ్మెల్యే వినతి

మంత్రి కందుల దుర్గేష్‌ను సన్మానిస్తున్న, ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని ఏపీ పర్యాటక సినీ ఆటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరా రు. విజయవాడలో మంత్రిని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఇందులో ముఖ్యంగా కాణి పాకం ఆలయం అభివృద్ధి పనులపై చర్చించడంతో పాటుగా, పూతల పట్టు నియోజకవర్గంలోని ఐరాల, మొగిలి ప్రాంతాలను పర్యాటక ప్రాంతా లుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే వాటిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

13 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండ లంలోని ఏపీఆర్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటికి ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపా ల్ ఈ ఆర్ శోభ శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. వి నిఖితాంజలి, ఎస్ జ్ఞానశ్రీ ఇద్దరు నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. సి తన్మయి , బిఎం హారిక, సీ మేఘన , యన్ షణ్ముఖ ప్రియ , యం అమృత , పీ శ్రావణి, బి నందిని, బి దివ్య , ఆర్‌వి దివ్యశ్రీ తొమ్మిది మంది ఆర్‌కె వ్యాలీ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి, టి తేజస్విని , జి శ్రావ్య ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ శోభ , ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మతిలేక డయేరియాకు బలి

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

తమకు ఏమి జరిగిందో తెలీదు. ఎక్కడున్నామో తెలీదు... ఉబికి వస్తున్న మూత్రం..అంతలోనే విరోచనాలు... చుట్టూ చేరిన జనాలను చూసి కంగారు. ఏడుస్తున్న కొందరు స్నేహితులు... ఓదార్చుతున్న టీచర్లు... ఇది గత బుధవారం తిరుపతి పాస్ మానసిక వికలాంగుల కేంద్రంలోని దృశ్యాలు. పాచిన ఆహారమో... రకరకాల ఆహారాలు తినడం మూలంగానే అక్కడి విద్యార్థులకు డయేరియా సోకింది. దీన్ని గుర్తించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇద్దరు మానసిక అనాథలు ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరం.

తిరుపతిలోని పాస్ మానసిక వికలాంగుల ఆశ్రయ కేంద్రం 24 సంవత్సరాల క్రితం తిరుపతిలో ఏర్పాటు చేశారు. గతంలో ఎంఆర్ పల్లిలోని న్యూబాలాజీ కాలనీ వద్దనున్న ఈ కేంద్రాన్ని ఆరు సంవత్సరాల క్రితం పద్మావతిపురంలోని పంచాయతీ కార్యాలయానికి సమీపంలోకి మకాం మార్చారు. ఇందులో ఎలాంటి ఆదరణ, బంధువులు, కుటుంబ సభ్యులు ఎవ్వరూలేని మానసిక అనాథలు 22 మంది, అందరూ ఉన్నా అలనా పాలన ఇబ్బంది కావడంతో విధిలేక ఆశ్రమంలో ఉన్న వారు మరో 50 మంది. మొత్తం 72 మంది మానసిక వికలాంగులు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ఆరు సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కల్గిన వారు అక్కడ ఉన్నారు. బయట వ్యక్తులను లోపలకి అనుమతించరు. దీంతో అక్కడ ఏమి జరుగుతుందో తెలిని పరిస్థితి. దీనికి తోడు ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీ నుంచి వచ్చే నీటి సరఫరా అరకొరే కావడకంతో విధిలేని పరిస్థితులో నిర్వాహకులు బయట నుంచి రోజు రెండు ట్యాంకర్ల నీటిని తోలించుకుంటున్నారు. నిర్వహకులు తమకు అందుబాటులో ఉన్న ఆహారాన్ని అందిస్తూ, సొంతంగా ఓ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్‌ఎంపి వైద్యులు)చే అవసరమైన వారికి ప్రథమచికిత్స అందిస్తున్నారు. ఆశా వర్కర్లు సైతం లోనికి వెళ్లరు. అప్పుడప్పుడూ గేటు వద్దకు వెళ్లి నిర్వాహకులతో మాట్లాడి తిరిగి వస్తుంటారు. పారిశుద్ధ్య కార్మికులు కూడా వారానికి ఒకరోజు ప్రధాన గేటు లోపలికి వెళ్లి చెత్తను తీసుకొస్తుంటారు. పద్మావతి పురంలోకి మకాం మార్చాక ఆరు సంవత్సరాలుగా ఒకరంటే ఒక పిహెచ్‌సికి చెందిన వైద్యులు కూడా అటువైపు కన్నెత్తి చూస్తుంటే ఒట్టు. ఈ నేపథ్యంలో జూలై 9వ తేది ఒక్క సారిగా ఉదయం 9 గంటల ప్రాంతంలో అక్కడ అలజడి రేగింది. అంతా హడావిడి... ఉరుకులు పరుగులు.. కొంతమంది మానసిక వికలాంగులను చేతులపై మోసుకొస్తున్న వారు కొందరు. అందుబాటులో ఉన్న వాహనాల్లో ఆసుపత్రికి తరలించే పనిలో కొందరు. అందుకు కారణం అక్కడ వారికి డయేరియా సోకడంతో వాంతులు, విరోచనాలు విజృంభించడం, అప్పటికే ఇద్దరు మానసిక దివ్యాంగులు డయేరియాకు బలికావడమే. ఈ నెల 5వతేదీ శుక్రవారం రాత్రి నిర్వహకులు పిల్లలకు బోండాలు సరఫరా చేశారు. శనివారం ఉదయం కొంతమంది మానసిక దివ్యాంగులు నీరసంగా కనిపించారు. ఆశ్రమం వైద్యుడికి సమాచారం అందిస్తే అతను అందుబాటులో లేడు. ఆదివారం కొంత మందికి వాంతులు కావడంతో మరోసారి వైద్యునికి సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం పిల్లలను పరిశీలించి, వారికి మాత్రలు పంపిణీ చేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం నలుగురికి విరోచనాలు ఎక్కువ కావడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గణపతి అనే అనాథ మరణించాడు. అక్కడ కూడా నిర్లక్ష్యమే. రుయా వైద్యులు మరణించిన వ్యక్తికి ఏమైంది..? ఎందుకు చనిపోయాడో నిర్ధారించలేదు. మానసిక వికలాంగులు కదా అని మిన్నకుండిపోయారు. పోస్టుమార్టం కూడా లేకుండా అతని దహనక్రియలు పూర్తి చేశారు. అదే రోజు సాయంత్రం మరో ఆరు గురికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. ఆసుపత్రికి తరలించారు. అయినా నిర్వాహకులు కాని, వైద్యులు కానీ అప్రమత్తత మరిచారు. మంగళవారం ఉదయం మరి కొంత మందికి విరోచనాలు కావడకంతో రుయా ఆసుప్రతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేషాచలం అనే బాలుడు మృతి చెందాడు. దీంతో ఒకసారిగా అక్కడ భయాందోళనలు చోటు చేసుకున్నాయి. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సుమారు 12 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరడంతో ఆ విషయం ఆనోట ఈనోట పాకి మీడియా చెవిన పడింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

నిర్ధారణలోనూ నిర్లక్ష్యమే..

ప్రజాదృష్టి

పంచాయతీ సిబ్బంది, అధికారులు వెంటవెంటనే ఆశ్రమం చుట్టూ ఫాగింగ్, బ్లీచంగ్ పిచికారీ చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో నలుగురు ఏఎన్‌ఎంలు, ఆశాలను, ఒక వైద్యురాలిని అక్కడికి పంపారు. అప్పటికప్పుడే ప్రాథమిక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా వాంతులు, విరోచనాలతో వికలాంగులు ఇబ్బంది పడుతుంటే అటు నిర్వహకులుగాని, ఒక వ్యక్తి తమ ఆసుపత్రిలో చనిపోయినందుకు కారణాలు వెతికి అప్రమత్తం చేయడంలో వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. 11 గంటలకు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను ఆరా తీశారు. సాయంత్రం తిరుపతి కలెక్టర్ సైతం దీనిపై స్పందించి ఆసుపత్రి, ఆశ్రమాన్ని సందర్శించి, అధికారులతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మరుసటి రోజు స్థానిక ఎంఎల్‌ఏ అధికార పార్టీ నాయకులతో ఆశ్రమానికి చేరుకుని హడావిడి చేశారు. ఆశ్రమం చుట్టుపక్కల స్వయంగా శుభ్రం చేస్తున్నట్లు ఫొటోలకు ఫోజులిచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగాక హడా విడి, హంగామ చేయడం కంటే ముందస్తు హెచ్చరికలతో అందర్ని అప్రమత్తం చేసి, అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందు బాటులో ఉంచి ఉంటే ఇద్దరు మానసిక వికలాంగులను కాపాడి వుండొచ్చు. చనిపోయిన తర్వాత హంగామా ఏంటి!' అంటూ చుట్టుపక్కల వారే ముక్కున వేలేసుకోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఇలాంటి కేంద్రాలపై దృష్టిపెట్టి, తరచూ తనిఖీలు చేస్తూ, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

డిజిటల్ ఎంతో సులభం

- కనిపించని చిల్లర సమస్య- వ్యాపారుల్లో ఆనందం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గతంలో చేతుల్లో నగదు ఉంటేనే, వ్యాపార లావాదేవీలు జరిగేవి. ఎక్కడైనా గ్రామాల్లో గాని , పట్టణాల్లో గాని శుభ అశుభ కార్యాలు అయినా డబ్బుతో ముడిపడి ఉండేవి. చేతిలో డబ్బు ఉంటేనే పనులు సాగేవి. సుదూర ప్రాంతాల నుంచి తెలిసిన వ్యక్తి దగ్గర నుంచి అరువు తెచ్చుకునేవారు. అలాంటి వాటితో కష్టాల తో సతమతమయ్యేవారు. ఒక వ్యక్తి చేతిలో డబ్బు లు ఉంటే దొంగల భయం అధికం. డబ్బులు తీస్తున్న వ్యక్తి ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులకు కంటి మీద ఉండేది కాదు. ఇందుకు భిన్నంగా ఇప్పుడు నగదు రహిత లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. నగదు అవసరాలు ఎక్కువగా ఉండటంతో జేబుల్లో రూపాయి లేకపోయినా బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే చాలు.. ఎంతటి కార్యమైనా ఏ పనైనా ఇట్టే అయిపోతుంది. గతంలో ఆర్‌బిఐ, ప్రధాని నరేంద్ర మోడీ చర్చించి 2016 నవంబరు 8వ తేదీన నగదు రహిత లావాదేవీలకు పునాది వేశారు. అప్పట్లో రూ.1000, 500 పాత నోట్లను రద్దుచేసి వాటి స్థానంలో కొత్త నోట్లను ముద్రించిన సంగతి విదితమే. దీంతో నగదు కొరత ఏర్పడింది. అదే సమయంలో ఏటీఎంలో ఫోన్ పేలు, గూగుల్ పే , క్రెడిట్ కార్డ్ లాంటి యాప్‌లో జనంలోకి వచ్చి లావాదేవీలు సాగాయి. దీంతో నగదు కొరత సమస్యల కొంత వరకు పరిష్కారమైంది. 60 శాతం స్వైపింగ్ వాడేవారు. అది ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది. నేడు క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఒక్క నిమిషంలోనే లావా దేవీలు పూర్తి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అన్ని బ్యాంకులలో ఈ డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహిస్తున్నారు.

లావాదేవీలు సులభతరం

డిజిటల్ లావాదేవీలు సులభతరంగా ఉండటంతో జనాల్లో వీటిపై ఆసక్తి పెరుగుతోంది. వీధి వ్యాపారులు, టీ కొట్టు నిర్వహించే వారు, కూరగాయలు , పండ్ల వ్యాపారు లు, చిన్నచిన్న రిటైల్ వ్యాపారులు సైతం ఈ డిజిటల్ లావాదేవీల కోసమే క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్నారు. ఫోన్ రీఛార్జిలు, విద్యుత్ బిల్లు , తదితర బిల్లుల చెల్లింపులకు ఈ డిజిటల్స్ సేవలు సులభ మార్గంగా మారాయి. ఈ సేవలు పెరగడంతో ఆర్‌బిఐ కరెన్సీ ముద్రణ గణనీయంగా తగ్గించిందని ప్రముఖ వ్యాపారవేత్తలు పేర్కొంటున్నారు. ఈ ఏడాది వృద్ధులకు మే, జూన్ నెలలోనూ పింఛన్ సొమ్మును వారి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేసిన సమయంలోనూ డిజిటల్ లావాదేవీలు వినియోగించుకున్నారు.

డిజిటల్ ద్వారా నగదు చెల్లిస్తున్న వినియోగదారుడు

సులభతరం..సురక్షితం

డిజిటల్ చెల్లింపుల వల్ల ఎంతో మేలు చేకూరుతుంది. వినియోగ దారుడు మేము అమ్మిన వస్తువుకు సరిపడ నగదు డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లిస్తున్నారు. చిల్లర కొరత సమస్య రాదు. ఒక్క రూపాయి నుంచి ఎంతైనా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం మొదలైన యాప్‌ల ద్వారా చెల్లించవచ్చు. క్రెడిట్ కార్డు ద్వారా కూడా లావాదేవీలు జరుగుతున్నాయి. నెలసరి ఖర్చు ఎంత పెట్టామో తిరిగి చెక్ చేసు కోవచ్చు. చాలా బాగుంది..ఈ పద్ధతి ఇలాగే కొనసాగించాలి.

- ప్రసాద్, లక్ష్మీ మొబైల్స్ , ఎలక్ట్రానిక్స్ పచ్చికాపల్లం, వెదురుకుప్పం మండలం.

చాలా మంచి పద్ధతి

ఎంతో కాలం నుంచి నేను సిమెంట్ షాపును నిర్వహిస్తున్నాను. గతం లో సిమెంట్ అంగడికి వచ్చిన కస్టమర్ తగిన చిల్లర లేదని చెప్పడంతో మేమే వెళ్లి చిల్లర మార్చుకుని తీసుకు వచ్చి కస్టమర్‌కి ఇచ్చే వాళ్లం. ప్రస్తుతం ఈ డిజిటల్ పేమెంట్స్‌తో చిల్లర సమస్య తగ్గింది. ఎంతో సులభతరంగా మారింది. చిల్లర ఇచ్చే సమయంలో తేడా వస్తే షాపులో యజమానులు నష్టపోయేవారు .ఆ పరిస్థితి లేదు ఎంతో మేలు.

- సువ్వాల ఆనంద రెడ్డి, రాధాకృష్ణ ట్రేడర్స్ (సిమెంట్ షాప్), పచ్చికాపల్లం, వెదురు కుప్పం మండలం.

అకౌంటులో పడిపోతుంది..

వినియోగదారుడి డిజిటల్ చెల్లింపుల కారణంగా డబ్బు ఇబ్బందే లేదు.. మా అకౌంట్లో పడిపోతుంది..గతంలో డబ్బులు చేతికి ఇచ్చేవారు. మనం చెప్పినంత ఇచ్చేవాళ్లు కాదు. వ్యాపారానికి వచ్చేవాళ్లు మనం చెప్పిన డబ్బులను ఫోన్ పే చేస్తున్నారు. బాక్స్‌లో వాళ్లు ఎంత వేస్తారో చెబుతుంది. మన అకౌంట్లో భద్రంగా ఉంటుంది.

- నీరజ, పూలు పండ్ల వ్యాపారి, పచ్చికాపల్లం, వెదురు కుప్పం మండలం.

స్టీల్ ప్లేట్లు వితరణ చేస్తున్న జీవరత్నం నాయుడు

అన్న క్యాంటీన్‌కు స్టీల్ ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో మొదట చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరులో పునః ప్రారంభమైన అన్న క్యాంటీన్ కు 200 వందల స్టీల్ ప్లేట్లను యాదమర్రి మండలం, బండివాండ్ల వూరుకు చెందిన బండి జీవరత్నం నాయుడు శనివారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు ముమ్మరం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: దోమల వ్యాప్తిని అరికట్టి, లార్వాను నశింపచేయడానికి ముందస్తు పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశామని సర్పంచ్ రమేష్ బాబు అన్నారు. శనివారం కోగిలేరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరిధిలోని కోగిలేరు, బసవరాజుకండ్రిగ, పొట్టగానిపల్లి, చీకలదిన్నేపల్లిలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురుగునీటి కాలువలు, పేడదిబ్బలు, రోడ్లతో పాటు ఇంటింటి దగ్గర మలేరియా మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలన్నారు. పెద్దపంజాణి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎంపిహెచ్ఓ శ్రీను, ఆశా వర్కర్ లలిత, అంగన్‌వాడీ కార్యకర్త సునీత ఇంటింటికి వెళ్లి జ్వరాలు వచ్చిన వారి రక్త నమూనాలు సేకరించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మహేందర్ రెడ్డి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏపీ మాజీ సీఎం జగ న్మోహన్ రెడ్డిని గూడూరు మండలం నెల్లబూరు గ్రామానికి చెందిన జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ పూటుకూరు మహేందర్‌రెడ్డి శనివారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన వెంట గూడూరు వైస్ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

రాజకీయ దాడులు వద్దు: ఎంపీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజకీయాలు ఎన్నికల వరకే చూడాలనీ, అధికారం ఉందని ప్రతిపక్ష కార్యకర్తలపై కక్షపూరిత దాడులు చేయడం సమంజసం కాదని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇరు పార్టీల ఘర్షణలో గాయపడి స్థానిక ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్త రమేష్‌ను శనివారం ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. బాధితుడు రమేష్‌ను ఘర్షణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కక్ష కట్టి దాడులకు పాల్పడుతున్నారనీ, తనను తన కుటుంబాన్ని వేధిస్తున్నారని బాధితుడు రమేష్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పరామర్శ అనంతరం ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులు తగమన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉంచాలనీ, కక్ష సాధింపులతో దాడులు చేసుకుంటూ పోతే గ్రామాలు అశాంతికి నిలయంగా మారుతాయని ఇది మంచి పద్ధతి కాదన్నారు. పోలీసులు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన చేపట్టండి: టిఎన్‌ఎస్‌ఎఫ్

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో నెలకొన్న అసంఘటిత పరిస్థితులను రూపుమాపి, పరిపాలనలో ప్రక్షాళన తీసుకువచ్చి, పారదర్శకతను, నిష్పక్షపాతంగా పరిపాలన వర్సిటీల్లో ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఉందని టీఎన్‌ఎస్‌ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణనాయుడు మంత్రి నారా లోకేష్‌కి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీయూలో ఉన్న పలు రకాల సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళినట్లు వెల్లడించారు.

షిరిడీ సాయి సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని టీడీ రోడ్డులోని షిరిడీ సాయిని శనివారం ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన లక్ష్మణరాజు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే విచ్చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గెలుపొందితే 101కొబ్బరికాయలు కొడతానన్న మొక్కును తీర్చుకున్నట్లు లక్ష్మణరాజు తెలిపారు. నాయకులు భాస్కర్ రెడ్డి, అములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య కళాశాలకు కొత్త కోర్సులు మంజూరు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని శ్రీవి ద్యా ఎడ్యుకేషనల్ సొసైటీకు చెందిన కళాశా లలో రెండు సంవత్సరాల ఎంసీఏ మూడు సంవత్సరాల బీసీఏ డేటా సైన్స్, ఆర్టిఫి షియల్ ఇంటలిజెన్స్ కంప్యూటర్ కోర్సులు, 5సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీబీఎ, ఎంబీఎ మేనేజ్మెంట్ కోర్సులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఏఐసీటీఈ న్యూఢిల్లీ వారిచే అనుమతి మంజూరు అయినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్వేర్ రంగంలో కంప్యూటర్ కోర్సులకు గల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని తమ కళాశాలలో ఈ కోర్సులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సులు చేసినవారికి సాఫ్ట్వేర్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ఆయన తెలిపారు.

శ్రీసిటీలో 16న మెగా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-సత్యవేడు: నిరుద్యోగ యువతకు శ్రీ సిటీలో ఈ నెల16న జరగనున్న మెగా ఉద్యోగమేళాకు సంబంధించి శనివారం ఓ ప్రకటన విడుదలైనది. శ్రీసిటీ, ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో 'ఫ్లాగ్' పేరిట మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. వివరాలకు కోసం ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ సోర్సింగ్ హెడ్ ప్రియా కవిచెల్వన్‌కు 73052 54222 సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ పనుల పరిష్కార దిశగా చర్యలు

ఐఐటిని సందర్శనలో కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఐఐటిని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. శనివారం ఏర్పేడు వద్ద గల కేంద్ర విద్యాసంస్థ ఐఐటిని కలెక్టర్ జెసితో కలిసి సందర్శించగా ప్రొఫెసర్ డాక్టర్ కేఎన్.సత్యనారాయణ క్యాంపస్ పురోగతిపై వివరించారు. కలెక్టర్ పలు వివరాలు తెలుసుకుని, పెండింగ్ అంశాలు, భూసంబ ంధిత, ఇతర సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో ఐఐటి డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

సహాయ సంచాలకులు ఆసిఫ్

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య సహాయ సంచాలకులు ఆసిఫ్ పేర్కొన్నారు. శనివారం బంగారుపాళెం మండలం సంక్రాంతి పల్లి పశు వైద్య కేంద్రంలో సబ్సిడీ మొక్కజొన్న, జొన్న రకం విత్తనాలు పంపిణీ డాక్టర్ రూన్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడకపోతుందని, పశువులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తోందని రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జిరాక్స్ పేపర్లు సమర్పించి ఒక కేజీ మొక్కజొన్న 85 రూపాయలకు, ఐదు కేజీల జొన్నలు 115 రూపాయలకు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. దీన్ని ప్రతి పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, వివిఎల్ నాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి ఆరవ ఆరాధన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో గొప్ప నాదస్వర కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళానిధి నాటక అకాడమీ యువ పురస్కార్ అవార్డు గ్రహీత విజయ్ కార్తికేయన్, ప్రకాష్ ఇళయరాజా కచేరి ప్రదర్శించారు. డోలు సహాయకులుగా వియమ్ గణపతి , కేఏ మనోహర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కే శివానందం, నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కళామందిర్‌ను సందర్శించిన ఎంపీ

ప్రజాశక్తి -గంగవరం: అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ శనివారం మండలం లోని కళా మందిర్ ను సందర్శించినట్లు నిర్వాహకులు తులసినాథం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాతృభాష పరిరక్షణకు పార్లమెంట్ వేదికగా కృషి చేస్తానన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు అందించడానికి కృషి చేస్తున్న తెలుగు సాహిత్య సేవా సమితి సభ్యులు అభినందనీయులు అన్నారు. ఈ సందర్భంగా కళామందిర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తులసి నాథంనాయుడు, కార్యదర్శి ఉష, గురుమూర్తి శ్రావణి గీతాంజలి గిరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారని తెలిపారు.

ఎంపీని సన్మానిస్తున్న కళా మందిర్ నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని కలగటూరు పంచాయతీలో శనివారం తిరుపతి రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని నిర్వాహకులు టిఎన్ నాయుడు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం వంద మందికి పైగా ఉచిత వైద్యం అందించి ఔషధాలు పంపిణీ చేశారని ఆయన తెలిపారు. మెరుగైన వైద్యం కోసం 20 మందిని తిరుపతి రమాదేవి ఆస్పత్రికి రెఫర్ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వేదతేజ, విజయ్, స్థానిక ఎంపిటిసి భాస్కర్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు బిసిజి టీకాలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మెప్మా, నగర పాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో 60 ఏళ్ల పై బడిన నిరాశ్రయులకు ఉచితంగా క్షయ నివారణ కోసం నిరాశ్రయులకు బిసిజి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వసతి గృహ నిర్వాహకులు, సపోర్ట్ సంస్థ అధ్యక్షులు పి జోసెఫ్ రాజు మాట్లాడుతూ నిరాశ్రయులకు ఇదొక గొప్ప అవకాశం అన్నారు. వ్యాధులు రాకుండా బిసిజి టీకా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిరాశ్రయులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వాళ్ల ఆరోగ్య సంరక్షణ కోసం బిసిజి టీకా వాళ్లకు ఎంతో రక్షణ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది ప్రమీల, శశిరేఖ, శ్రీను వైద్య సిబ్బంది ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్ రాధ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం పరమ సముద్రం గ్రామం లోని కేజీబివి పాఠశాలలో విద్యా ర్థులకు శనివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళ్యాణ్ ఫౌండేషన్ సీఈఓ పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ పరీక్షలలో పాఠశాలలోని 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభను కనపరిచిన విద్యార్థినులకు విద్యా సామగ్రి బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో పిఇటి సబితా, ఉపాధ్యాలు పాల్గొన్నారు.

కొత్త చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం: పొన్న యుగంధర్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండల కేంద్రంలో ఉన్న కొత్త చెరువు ఆక్రమణలు తొలగించి సుందరంగా తీర్చిదిద్దుతామని జనసేన గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేర్కొన్నారు. కొత్త చెరువును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం కేంద్రంలోని కొత్త చెరువు ఆక్రమణలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. స్థానిక కూటమి ఎమ్మెల్యే డాక్టర్ థామస్, కూటమి ఎంపీ దగ్గు మల్ల ప్రసాదరావు సహకారంతో సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల సహకారం, అవసరమైతే కలెక్టర్ సహకారం తీసుకుంటామని, కూటమి నాయకుల సహకారంతో దీన్ని అంగరంగ వైభవంగా తీర్చి దిద్దు తామని పేర్కొన్నారు. ఈ కా ర్యక్ర మంలో జనసే న మండల అధ్యక్షులు పురుషోత్తం, భాస్కర్, వెదురుకుప్పం మండల యువ జన అధ్యక్షులు సతీష్, నియోజకవర్గ ఐటీ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, వెదురు కుప్పం మండల ప్రధాన కార్యదర్శి బెనర్జీ, సంయుక్త కార్యదర్శి, సాయి, నాయకులు ప్రభు, అశోక్, లోకేష్, వెదురుకుప్పం మండల ఉపాధ్యక్షులు మునిరత్నం, బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కొత్తచెరువును పరిశీలిస్తున్న పొన్న యుగంధర్

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని పిఇఎస్ అర్బన్ హెల్త్ సెంటర్లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని లయన్స్ క్లబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ శిబిరంలో వంద మంది కంటి రోగులు పాల్గొన్నారు. వారిని పరీక్షించిన వైద్యులు అందులో 21 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశామన్నారు. వీరందరికి స్థానిక పిఇఎస్ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వచ్చిన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పీజీ సెల్వం, సోమశేఖర్, సెంథిల్ కుమార్, చరణ్, ఆజాద్, శివశంకర్, నితిన్ కుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, శివ ప్రసాద్, పిఈఎస్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సేవలకు గుర్తింపు 15 ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు రోటరీ క్లబ్ చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి 15 ప్రశంసా పత్రాలను ప్లాటినం అవార్డుగా ప్రకటించినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యన్ అనిల్ కుమార్, సిఎస్ రాజారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రశంసాపత్రాలను బెంగళూరులో నిర్వహించిన రోటరీ సమావేశంలో పుంగనూరు రోటరీ సెంటర్‌కు 15 ప్రశంసా పత్రాలు, ప్లాటినం అవార్డులు ప్రకటించినట్లు తెలిపారు. అవార్డులను రోటరీ గవర్నర్ ఉదయ్ కుమార్ అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్ అనిల్ కుమార్ సిఎస్ రాజారెడ్డికి అందించారు. ఒక్కసారిగా15 ప్రశంసాపత్రాలు అందు కోవడంతో పుంగనూరు రోటరీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అవార్డులు అందుకుంటున్న పుంగనూరు రోటరీ క్లబ్ సభ్యులు

'117 జీవోను రద్దు చేస్తేనే పాఠశాలల మనుగడ'

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అసంబద్ధమైన 117 జీవోను రద్దు చేసి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై చిత్తశుద్ధిని చాటాలని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం, జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో కారణంగా ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు మూతపడ్డాయని , టీచర్ పోస్టులు భారీ సంఖ్యలో కుదించబడ్డాయని, దీనివల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు, ఈ జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని తప్పని సరిగా కొనసాగించాలని డిమాండు చేశారు. పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్య నివారించేలా, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్, ఎయిడెడ్, గురుకుల, ఆదర్శ పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పిఎఫ్ స్లిప్పులు ఆన్‌లైనులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర నాయకులు సుబ్రమణ్యం రాజు, గంటా మోహన్, హేమచంద్ర రెడ్డి, శ్రీదేవి, జగన్మోహన్ రెడ్డి, లోకనాథ రెడ్డి, జనార్దన్ రెడ్డి, జిల్లా నాయకులు బోడే మోహన్, యువరాజు,పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గత ప్రభుత్వం మోపిన కేసులు మాఫీ చేయాలి: సజ్జాద్ బాషా

ప్రజాశక్తి -పుంగనూరు:

గత వైసిపి ప్రభుత్వం రాజకీయ పార్టీలపై మోపిన కేసులను మాఫీ చేసేందుకు చట్టం తీసుకొస్తానని ఎన్నికల ప్రచారంలో చెప్పిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే దాన్ని అమలు చేయాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రాజకీయ పార్టీల కార్యకర్తల మీద మోపిన అభియోగాలు కేసులు అధికారంలోకి వచ్చిన వెంటనే 30 రోజులలో ప్రత్యేక చట్టంతో వీటిని రద్దు చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి వెంటనే రాజకీయ పార్టీల కార్యకర్తల మీద మోపిన వివిధ పద్ధతుల్లో ఆరోపణ కేసులను రద్దుచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు ఎంతో విశ్వాసంతో కొన్ని లక్షల మంది కార్యకర్తలు నమ్మకంతో ఎదురుచూస్తున్నారు. వెంటనే ప్రత్యేక చట్టంతో రద్దు చేయాలన్నారు. దేశంలో జరిగిన ఉప ఎన్నికల్లో 13స్థానాలకు గాను 10 స్థానాలలో. ఇండియా కూటమి విజయం సాధించింది అన్నారు. కాంగ్రెస్ సారథ్యంలో ఘనవిజయం సాధించిందని బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం ఘోరమైన ఓటమి పాలయ్యిందన్నారు. ప్రజలు భారత దేశంలో ఇండియా కూటమి వైపు ఉన్నారని, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను ప్రజలు బాగా ఆదరించారన్నారు. బిజెపి మిత్రపక్షాలకి ప్రజలు ఆదరించలేకపోయారని ఆరోపించారు.

బిల్లులు మంజూరు చేయండి..

సీఎంకు వినతి

ప్రజాశక్తి - రామకుప్పం: వైసిపి వారు కక్ష కట్టి అక్రమంగా తమపై పెట్టిన కేసులను ఎత్తివేసి, తమకు రావలసిన బిల్లులు మంజూరు చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ను కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం ఉనిసిగాని పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ మహాదేవి, చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి జయశంకర్ కోరారు. విజయవాడ మంగళగిరిలో చంద్రబాబు ని కలిసి తనపై, తన కుటుంబం పై ఉన్న కేసులను వారు సర్పంచ్ గా ఉన్నప్పుడు 2013 నుండి 2019 వరకు రావలసిన బిల్లులు, వైసిపి కక్షగట్టి నిలిపిన బిల్లులను మంజూరు చేయాలని తమపై పెట్టిన తప్పు డు కేసులను విచారించి ఎస్ఐ నుండి సీఐ నుండి, డీఎస్పీ వరకు తప్పు చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సిఎం సాను కూలంగా స్పందించి తప్పకుండా చర్యలు తీసుకుని తగిన న్యాయం చేస్తామని తెలిపారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బొజ్జలకి సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని ఊరందూరులో శనివారం శ్రీకాళహస్తి డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డ్రైవింగ్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన సోంపల్లి శేఖర్ నాయుడు ఎన్నుకున్నారు. శేఖర్‌నాయుడు శ్రీకాళహస్తి పట్టణంలో శివసాయి మోటార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. శేఖర్ నాయుడు కు జిల్లా కార్యదర్శి పదవి రావడంతో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి సన్మానం చేశారు.

మురుగు కాలువలో చెత్త, మట్టి తొలగించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగరంలో మురుగు కాలువలో మట్టి పడి పూడిపోయి చెత్తతో నిండి పోయిందని నీళ్లు సరిగా వెళ్లడం లేదని వెంటనే తొలగించి కాలువలు లోతు పెంచాలని సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ చిత్తూరు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధాన రహదారుల పక్కన ఉన్న కాలువలో నీళ్లు వెళ్లకుండా నిలిచిపోయాయని దాని ద్వారా దుర్వాసన వస్తుందని అందులో దోమలు చేరుతున్నాయని ఆయన తెలిపారు. వర్షాకాలంలో వర్షం నీళ్లు కాలువల్లో పోకుండా రోడ్లు పైకి వస్తున్నాయని ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ముందున్న కాలువ దర్గా నుంచి ఎమ్మెస్సార్ వరకు వచ్చే కాలువ నీళ్లు సరిగా వెళ్లడం లేదని ఎమ్మెస్సార్ వద్ద కాలువలో నీళ్లు వెళ్లక రోడ్డు పైకి వచ్చి పొన్నియమ్మగుడి వీధి, సుందరయ్య వీధి, చర్చి వీధి, గున్నాథ థియేటర్ మీదుగా గాంధీ రోడ్డు వరకు నీళ్లు నిండిపోతున్నాయని ఆయన తెలిపారు. మురికి నీళ్లు నిలవడం వల్ల నడవాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ అధికారులు, మేయర్, పాలకమండలి సభ్యులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మురికి వాడల్లో, కాలువలో నీళ్లు పోక నిలిచిపోయి దోమల చేరి రాత్రుల్లో ప్రజలను కుట్టడం వల్ల ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్లు గుంతల పడి నీళ్లు నిలిచిపోయి దోమలు ఉత్పత్తి అవుతున్నాయని అవి కుట్టి డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు విష , జ్వరాలు వస్తాయని అధికారులు వీటిపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వుందన్నారు. మున్సిపాల్టీ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసరు రోజూ నగరంలో పర్యటించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో నీవా నదిని శుభ్రం చేశారని అయితే మళ్లీ చెట్లు, పొదలు పెరిగి మట్టి పేరుకుపోయి నది పూడి పోయిందని చెట్లను తొలగించి పూడిక తీత పనులు చేపట్టాలని ఆయన కోరారు. గతంలో వర్షాలకు ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారని ఇళ్లపైకి నీళ్లు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని సురేంద్రనాథ్, బి రాజేంద్రన్ కోరారు.

'పేదల భూమిలో పెత్తందార్లు'

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం వికృతమాల రెవిన్యూ పరిధిలోని మర్రిమంద గ్రామంలో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇండ్లు ఇచ్చి నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇక్కడ నివాసం ఉన్న పేదల కోసం జగనన్న కాలనీలో ఒక ఎకరా 12సెంట్లు భూమిని గత ప్రభుత్వం భవిష్యత్తు ప్రజా అవసరాల కోసం స్కూల్ బిల్డింగు, హాస్పిటల్ నిర్మాణం, కమ్యూనిటీ హాళు వగైరాలు నిర్మించడం కోసమని ఈ భూమిని వదిలిపెట్టడం జరిగింది. కానీ గత ప్రభుత్వంలో కొంతమంది రాజకీయ నాయకుల కోసమని ఈ ఒక్క ఎకరా 12సెంట్లు భూమి ఆ పేదల కోసం కాకుండా కొంతమంది రాజకీయ నాయకులకి కార్యకర్తలకు ఇవ్వడం. అందులో కొంతమంది ఒక్కో ప్లాట్ రెండు లక్షల రూపాయలకి అమ్ముకోవడం జరిగిందని ఇది సరైన పద్ధతి కాదని సిపిఎం పార్టీగా ఖండిస్తున్నామని, ఈ భూమిని తిరిగి ఆ కాలనీ వాసుల భవిష్యత్తు అవసరాల కోసం ఖాళీ చేయించి కాలనీవాసులకు ఇవ్వాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కరిముల్లా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.